
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
I
ఆదివారం 5 జనవరి 2025





ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని గోదాదేవికి కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడుకు చెందిన వికాస తరంగిణీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సారె సమర్పించారు.గోదాకృష్ణులను అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

# చుక్కలు మురిసి..

## జంగారెడ్డిగూడెంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

బుట్టాయగూడెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ముత్యాల ముగ్గులు.. మధ్యలో ముచ్చట గొలిపే గొబ్బెమ్మలతో జంగారెడ్డిగూడెంలో సంక్రాంతి పండుగ వాతావరణం ముందుగానే కన్పించింది. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సారథ్యంలో జంగారెడ్డిగూడెం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆ స్కూల్ ఆవరణలో శనివారం పోటీలు జరిగాయి. మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని బహుమతులను గెలుచుకున్నారు. ఈ పోటీల్లో 66 మంది పాల్గొన్నారు. నిబంధనలు ప్రకారం పోటీలో పాల్గొన్న వారందరికి బహుమతులు అందజేశారు.

### ముగ్గులతో మంచి సందేశం..

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న పోలవరం, చింతలపూడి ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, సొంగా రోషన్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ చూడడానికి ముగ్గులే అన్పించినా ఆ ముగ్గులతో కూడా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని ఇవ్వవచ్చన్నారు. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించడమే కాకుండా బహుమతుల ఇస్తూ సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించడం, కనుమరుగవుతున్న సంప్రదాయాలను ముందు తరాలవారికి అందించేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. మహిళల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసే ఇటువంటి మంచి కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని కోరారు. సంక్రాంతి పండుగ విశిష్టతను, మన సంప్రదాయాలను ఈ పోటీలు గుర్తు చేశాయన్నారు. ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ బి.హరిబాబు మాట్లాడుతూ మహిళల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడం అభినందనీయమన్నారు. పోటీల నిర్వహణకు సహకారం అందించిన స్కూల్ యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

### విజేతలు వీరే..

పోటీల న్యాయనిర్ణేతలుగా కె.రమాదేవి, పి.సౌభాగ్యవతి, టి.జ్యోతి, పి.సుజాత వ్యవహరించారు. నిబంధనలు మేరకు చుక్కల ముగ్గులు, పోతలు(గీతలు), మ్యాచింగ్, సంక్రాంత పండుగను తలపించేలా ముగ్గులను వేసిన వారిని గుర్తించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. పోటీల్లో మొదటి స్థానంలో జి.దుర్గాభవాని (రూ.6వేలు), ఎం.శేషమ్మ ద్వితీయ స్థానంలో (రూ.4వేలు), తృతీయ స్థానంలో దాస్యం ఝాన్సీరాణి (రూ.3వేలు) నగదు బహుమతిని గెలుచుకోగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ హరిబాబు బహుమతులను అందజేశారు. మరో పది మందికి కన్సొలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. వి.సౌమ్య, డి.రేవతి, పిభారతి, సీహెచ్ శశికళ, కె.లక్ష్మీ లావణ్య, పి.దివ్య, కె.చంద్రిక, డి.వరలక్ష్మీ, కె.రేణుక, ఎం.శిరీషా కన్సొలేషన్ బహుమతులను గెలుపొందగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మద్దిపాటి చైతన్య, టీడీపీ నాయకులు ముత్తారెడ్డి, రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



ముగ్గుల వద్ద యువతి సెల్ఫీ



మొదటి స్థానంలో నిలిచిన దుర్గాభవానికి నగదు బహుమతి అందిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ చైతన్య, ఆంధ్రజ్యోతి బీఎం హరిబాబు



రెండో స్థానంలో నిలిచిన శేషమ్మకు, మూడో స్థానంలో నిలిచిన ఝాన్సీరాణికి బహుమతుల అందజేత



మహిళకు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

### నేడు ఏలూరులో ముగ్గుల పోటీలు

ఏలూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఏలూరులో ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహణకు రంగం సిద్ధమైంది. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సారథ్యంలో మగువ ట్రెండింగ్ డిజైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఏలూరు అశోక్ నగర్‌లోని కేపీడీటీ హైస్కూల్ గ్రౌండ్‌లో పోటీలు జరుగుతాయి. న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేసి మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు చొప్పున నగదుతోపాటు కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారు.



### చాలా ఆనందంగా ఉంది

ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతిని పొందడం చాలా ఆనందంగా ఉంది. మొదటి బహుమతి నాకే వస్తుందని గట్టిగా నమ్మాను. నా నమ్మకం నిజం అయినందుకు ఆనందిస్తున్నాను. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహిస్తున్న ఆంధ్రజ్యోతి- ఏబీఎన్‌కు అభినందనలు తెలుపుతున్నాను. పోటీతత్వం అలవడుతుంది.

**జి.దుర్గాభవాని మొదటి బహుమతి, జంగారెడ్డిగూడెం**





### పోటీతత్వం అలవడుతుంది

ఇటువంటి ముగ్గుల పోటీలు నిర్వహించడం వల్ల మహిళల్లో పోటీతత్వం అలవడుతుంది. నాకు మొదటి బహుమతి వస్తుందని ఆశించాను. ద్వితీయ బహుమతి రావడం సంతోషంగా ఉంది. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గు వేశాను.

**ఎం.శేషమ్మ, ద్వితీయ బహుమతి, జంగారెడ్డిగూడెం**





### ముగ్గులు సంస్మృతిని ప్రతిబింబిస్తాయి

ముగ్గులు మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. పోటీలో తృతీయ బహుమతి రావడం ఆనందంగా ఉంది. చేతితోనే ముగ్గును వేశాను. ఇతర వస్తువులు ఉపయోగించలేదు. పోటీలో పాల్గొని అందంగా ముగ్గులు వేసిన మహిళలందరినీ అభినందిస్తున్నాను. ఆంధ్రజ్యోతికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

**దాస్యం ఝాన్సీరాణి, తృతీయ బహుమతి, జంగారెడ్డిగూడెం**



ముగ్గులను పరిశీలిస్తున్న విద్యార్థులు





మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సారథి

## ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన

### మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకం అమలుకు ఈ ఏడాది 27.39 కోట్లు వచ్చే విద్యాసంవత్సరం నుంచి రూ.85.84 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనున్నదని, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ, మధ్యాహ్నం బోజన పథకాన్ని మంత్రి ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రైవేట్ విద్యా సంస్థలను అభివృద్ధి పరుస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని విద్యాభ్యాసం పూర్తి చేసే సమయానికి వారి చదువుకు తగ్గ ఉపాధిని కల్పించే దిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 307 కోట్ల అంచనాలతో పనులను ప్రతిపాదించగా, ఇప్పటివరకు రూ.169 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భావి శాస్త్రవేత్తలు
కొవ్వలి, వీరవాసరంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు III
ఇంకా మిగిలే ఉంది..
ముంపు మండలాల్లో పరిహారం అటూ ఇటూ II



## సర్వాంగ సుందరంగా ఉండి పాఠశాల

**పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో అభివృద్ధి**

**రేపు పాఠశాలకు మంత్రి లోకేశ్ రాక**

ఉండి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉండి హైస్కూల్ రూపురేఖలు ఒక్కసారిగా మారి పోయాయి. జిల్లాలో పురాతన పాఠశాలలో ఉండి జిల్లా ఉన్నత పాఠశాల ఒకటి. 1918లో ఈ పాఠశాల ఏర్పాటు చేశారు. 2017 ఆగస్టు 12న శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి దాతల సహ కారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు.సుమారు కోటి రూపాయలతో పాఠ శాల అవరణలో వున్న పది ఎకరాల మైదా నాన్ని మట్టిపూడిక చేసి చదును చేయించి అందంగా తీర్చిదిద్దారు. పాఠశాల తొలినాళ్లలో నిర్మించిన పెంకుటిల్లు శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించి ఖరీదైన రేకును ఏర్పాటు చేసి రంగులతో తీర్చిదిద్దించారు. క్రికెట్ కోర్టు, వాలీ బాల్, షటిల్ ఆడేందుకు కోర్టులతో పాటు రన్నింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు పాఠశాల ఆవరణలో రకరకాల మొక్కలు, పండ్ల మొక్కలు నాటారు. పాఠశాల చుట్టు సీసీ రహదారులు, మంచినీరు, విద్యుత్ తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బాలిక జూనియర్ కళాశాలగా ఉన్న దీన్ని అప్‌గ్రేడ్ చేసి కో-ఎడ్యుకేషన్ విధానంలో జూనియర్ కళాశాల నిర్వహించాలనే ఆలో చనలో ఉన్నారు. ఉండిలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రఘు రామకృష్ణ రాజు ఆలోచన చేస్తున్నారు.

**6న హైస్కూల్‌కు మంత్రి లోకేశ్ రాక**

ఈనెల 6వ తేదీ సోమవారం ఉండి హైస్కూ ల్‌ను రాష్ట్రమంత్రి నారా లోకేష్ రానున్నారు. ఆయన చేతుల మీదుగా పలువు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. పాఠశా లను అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు ఏర్పాట్లును పర్యవేక్షించి సూచనలు అందించారు.

## నేడు హైందవ శంఖారావం.. ట్రాఫిక్ మళ్లింపు

ఏలూరు క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరిపల్లి వద్ద ఈనెల 5న నిర్వహిస్తున్న హైందవ శంఖారావం మహాసభ నేపథ్యంలో ఆ సభకు వెళ్లే వాహ నాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు ఎక్కడికక్కడ చర్యలు చేపట్టారు. ఆ రూటు గుండా ఇతర వాహనాలు వెళ్ళకుండా ట్రాఫిక్ మళ్ళింపు చేపట్టారు.

విశాఖ పట్టణం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు తూర్పు గోదావరి జిల్లా జిల్లా దివాన్ చెరువు బైపాసు మీదుగా గామన్ బ్రిడ్జి, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, అశ్వరావుపేట, ఖమ్మం మీదుగా సూర్యారావు పేట చేరుకోవాలి. భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, చింతలపూడి, అశ్వారావుపేట, ఖమ్మం మీదుగా హైదరాబాద్ చేరుకోవాలి. ఏలూరు వైపు నుంచి వెళ్లే వారు బైపాసులో జంగారెడ్డిగూడెం రోడ్డులో అశ్వా రావుపేట మీదుగా హైదరాబాద్ చేరుకోవాలి.

ఏలూరు బైపాసు నుంచి చింతలపూడి రోడ్డు గుండా సత్తుపల్లి మీదుగా కూడా హైదరాబాదు చేరు కోవచ్చు. తణుకు నుంచి హైదరాబాదు వెళ్లే వారు హనుమాన్ జంక్షన్, నూజివీడు, మైలవరం, ఇబ్రహీంపట్నం, నందిగామ మీదుగా హైదారాబాద్ వెళ్లాలి. హైదరాబాదు నుంచి విశాఖపట్టణం వెళ్లే వాహనాలు అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గామన్ బ్రిడ్జి మీదుగా మళ్లించినట్టు అధికారులు తెలిపారు.

## ఏలూరు నుంచి హైదరాబాద్‌కు మూడు కొత్త బస్సులు

ఏలూరు క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర వుతున్నా ఎన్నో సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. ఏలూరు డిపోకు చెందిన మూడు బస్సులను హైదరాబాద్ సర్వీసులుగా కొత్త బస్సులను ప్రవేశపెట్టగా వాటిని శనివారం సాయంత్రం ఏలూరు కొత్త బస్టాండ్‌లో ఎమ్మెల్యే చంటి, విజయవాడ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబులు ప్రారంభించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఈ ఆరు నెలల్లో



ఏలూరు జిల్లాకు 17 కొత్త బస్సులను అందిం చారన్నారు. వీటిలో రెండు ఏసీ ఇంద్ర, రెండు స్లీపర్ కోచ్‌లు, మిగిలినవి డీలక్స్ బస్సుల న్నారు. రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లను బాగు చేయడం, పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు వేస్తున్నామన్నారు.

# కారులో షికారు..!



**పాలకొల్లులోని ఒక ప్రముఖ వైద్యుడుకి కార్లు అంటే మహా పిచ్చి. ఆయనకు అర డజనుకు తగ్గకుండా కార్లు ఉంటాయి. ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో నాలుగు కార్లు తక్కువ కాకుండా ఉన్నాయి. ఇలా జిల్లాలో వందల సంఖ్యలో సంపన్నులు వద్ద ఒక్కొక్క కుటుంబంలోనే 4 నుంచి 8 కార్లు ఉన్నాయి. సంపన్న వర్గాల్లో కార్లు ఒక హోదా.. కానీ ఇప్పుడు మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాల్లో కూడా కారు ఒక ఫ్యాషన్‌గా మారింది..**

## మధ్య తరగతిలోనూ మారిన జీవన శైలి

**విలాస జీవనం వైపు అడుగులు**

**ఇంటికో కారు.. ఒకటి లేదా రెండు మోటారు సైకిళ్లు**

**కరోనా తర్వాత మారిన ఆలచోనా తీరు..**

**ఉన్నంతలో దర్జాగా జీవిద్దాం..**

**తరతరాల సంపదకు స్వస్తి**

**సామాన్యుల్లో పెరిగిన విలాసాలు**

**జిల్లాలో సొంత కార్లు 50 వేలు.. మోటారు సైకిళ్లు 6 లక్షలు**

**ప్రతీ 8 కుటుంబాలకు ఒక కారు**

పాలకొల్లు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాలు వెనుక్కు వెళ్లితే మధ్య తరగతి కుటుంబాలలో ఒక మోటారు సైకిల్ ఉంటే గొప్ప. కార్లు సంపన్న కుటుంబాలలోనే ఉండేవి. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు ఒక సైకిల్‌తో ఇంటిల్లిపాదీ గడిపిన రోజుల నుంచి ఇంటికో కారు.. రెండు మోటారు సైకిళ్ల స్థాయికి జీవన ప్రమాణాలు మార్పు చెందాయి. ఆయా కుటుం బాలలో ఆదాయం పెరిగిందా అంటే అధిక శాతం కాదనే



వాస్తవాన్ని నమ్మి తీరాలి. ఇప్పుడు ఒక రూపాయి ఉంటే 10 రూపాయలు వస్తువు అరువులో లభ్యమ వుతుంది. రూ.10 లక్షలు ఖరీదు చేసే కారు కొనుగోలు చేయాలంటే చేతిలో రూ.50 వేలు ఉంటే సరిపోతుంది. ప్రైవేటు బ్యాంకులు పిలిచి మరీ అప్పులు ఇస్తున్నాయి. దీంతో అవసరం లేకున్నా పలు కుటుంబాలలో కార్లు కొనుగోలు చేస్తున్నారు.ఒకప్పుడు పట్టణాలకు, నగరాలకు పరిమితమైన కార్లు, మోటార్ సైకిళ్ల వినియోగం ఇప్పుడు పల్లెలకు, గ్రామాలకు పాకింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వినియోగిస్తున్న కార్లు మోటారు సైకిళ్ల నిష్పత్తిని పరి శీలిస్తే పట్టణాలు కంటే గ్రామాల్లోనే అధికంగా ఉంది. 40 శాతం వాహనాలు పట్టణాల్లో ఉంటే 60 శాతం వాహనాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి.

కార్మిక వర్గాలలో ప్రతీ వంద కుటుంబాలలో 70 కుటుంబాలు పైబడి కనీసం బైకు లేదా స్కూటీ ఉంది. 30 శాతం కుటుంబాలలో సాధారణ సైకిల్‌తో పాటు మోటారు సైకిళ్ల ఉన్నాయి. ఏ వాహనం లేని కుటుంబాలు పట్టణాలలో 8 నుంచి 10 శాతం ఉండగా గ్రామాల్లో 6 శాతం ఉంది. వివిధ గణాంకాలు ప్రకారం మధ్య తరగతి కుటుంబాలలో ప్రతీ 10 కుటుంబాలలో మూడు కుటుం బాలకు సొంత కార్లు ఉన్నాయి. ఎగువ మధ్య తరగతి కుటుం బాలలో 50 శాతం పైబడిన కుటుంబాలలో కార్లు వినియో గిస్తున్నారు. ఎగువ మధ్య తరగతికి చెందిన పలు కుటుంబాలలో ఒకటి కంటే ఎక్కువ కార్లు రెండు నుంచి 4 మోటారు సైకిళ్ల కలిగి ఉంటున్నారు. ఇలా ప్రతీ కుటుం బంలోనూ మోటారు వాహనాలు పరిమితికి మించి పెరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో పౌరులు వినియోగించే కార్ల సంఖ్య 50 వేలు ఉండగా మోటార్ల సైకిళ్ల సంఖ్య 6 లక్షల వరకు ఉంటుంది.

### తరాల సంపదకు స్వస్తి

సాధారణంగా దిగువ మధ్య తరగతి, మధ్య తరగతి , ఎగువ మధ్య తరగతి వర్గాలలో అధిక శాతం తమ భవిష్యత్తు తరాలకి ఆస్తి ఇవ్వాలనే ధృక్పథంతో కష్టపడుతూ ఉంటారు. సామాన్య పేద వర్గాల్లో ఆ పరిస్థితి కొంత ఉన్నప్పటికీ అధిక శాతం కుటుంబ పోషణకు నెలవారీ ఖర్చులకే ప్రాధాన్యం ఇస్తారు. సంపన్న శ్రేణులు విషయానికి వస్తే ఆదాయపు పన్నులు నుంచి మిన హాయింపు పొందటానికి లేదా తనయులు కోర్కెలు తీర్చడానికి తమ తాహతకు తగ్గట్టుగా వాహనాలు కొనుగోలు చేస్తున్నారు.

### పెరుగుతున్న కాలుష్యం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏటికేడాది వాహనాలు పెరుగుతూ వస్తుండటంతో పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ వాయు కాలుష్యం పెరుగుతున్నది. వాహనాలు నుంచి వచ్చే కర్బన ఉద్గారాలు ప్రయాణికుల ఆరోగ్యాన్ని హరిస్తున్నాయి. ఇప్పుడు ప్రధాన రహదారుల వెంబడి వృక్షాలు సైతం తగ్గటంతో కార్బన్ డయాక్సైడ్ పెరిగి ఆక్సిజన్ శాతం తగ్గుతోంది.

### ట్రాఫిక్ ఇబ్బందులు

పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రహదారుల విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్ పెరుగుతున్నది. ఏలూరు నగరంతో సహా ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాల్లోనూ నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు గ్రామీణ ప్రాంతాలను వెంటాడు తున్నాయి. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన వద్ద తగినతంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరిగి పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు.

### డ్రైవింగ్ లైసెన్స్ నిబంధన పెట్టాలి

నాలుగు చక్రాల వాహనాలు మాట ఎలా ఉన్నప్పటికీ ద్విచక్రాల వాహనాలు కొనుగోలు చేసేవారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనం అమ్ముతామనే నిబంధన అమలు చేస్తే కొంత మేరకు వాహనాలు సంఖ్య పెరగటమే కాకుండా ప్రమాదాలు తగ్గుతాయి

### రిజిస్ట్రేషన్‌లో వెసులుబాటు వల్లే..

మొన్నటి వరకూ ఒక వాహనాన్ని కల్గి ఉన్న పౌరుడు మరో వాహనం కొనుగోలు చేస్తే మూడు శాతం అదనంగా ట్యాక్స్ వసూలు చేసేవారు. సుమారు రూ.10 లక్షలు ఖరీదు చేసే వాహనం కొనుగోలు చేస్తే అతని పేర మరో వాహనం ఉంటే రూ.30 వేలు ట్యాక్స్ అదనంగా కట్టాలి. ఇప్పుడు అదనపు భారం నుంచి వెసులుబాటు లభించింది. దీంతో వాహనం కొనుగోళ్లు మరింతగా పెరిగాయి.

### కరోనా తర్వాత మారిన జీవనశైలి

కరోనా మహమ్మారి నుంచి బతికి బయటపడిన పౌరుల ఆలోచనా ధోరణిలో చాలా మార్పులు వచ్చాయి. తృణప్రాయమైన ప్రాణం ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్నంతలో దర్జాగా జీవిద్దాం... అనే ఆలోచనలో అధిక శాతం ఉన్నారు. కరోనా నేర్పిన పాఠాలతో పలువురు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సొమ్ములు ఖర్చు చేస్తున్నారు. పిల్లికి కూడా బిక్షం పెట్టడురా అనుకునే వ్యక్తులు సైతం ఇప్పుడు సేవా కార్యక్రమాలకు ముందుకు రావడం గమనార్హం. ఒకప్పుడు ఎంత ఆస్తి సంపాదిద్దాం పిల్లలకు ఎంత కూడబెడదాం అని ఆలోచించేవారు. ఇప్పుడు అధిక శాతం పౌరుల ఆలోచనలలో మార్పులు వస్తున్నాయి. దీంతో ఉండ టానికి చక్కని ఇళ్లు కుటుంబ సభ్యులు నలుగురు ప్రయాణిం చడానికి ఒక కారు.. ఇంటాయన ఆపీసుకు లేదా వ్యాపారానికి వెళ్లటానికి ఒక బైకు. పిల్లలను స్కూల్‌లో దింపడానికి మార్కెట్‌కి వెళ్లడానికి ఇంటావిడకు ఒక స్కూటీ ఇలా వాహనాలు కొనే స్తున్నారు. పౌరులందరూ తమ స్థాయికి తగ్గట్టుకు జీవించడం మంచి పరిణామమే అయితే స్థాయికి మించి ఆడంబరానికి వెళ్తేనే ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



హాజరైన ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు



## గేమ్ ఛేంజర్ సందడి

**మెగా అభిమానులతో రాజమహేంద్రవరం రోడ్లు కిటకిట**

కడియం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రౌండ్‌లో గేమ్ ఛేంజర్ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ సందర్భంగా శనివారం సందడి నెలకొంది. రాష్ట్రం నలుమూలల నుంచి అభిమానులు వేమగిరి చేరుకున్నారు. హీరో రామ్‌చరణ్‌ను, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను చూడాలని మెగా అభిమానులు ఎదురు చూశారు. అభి మానులు రాకతో వేమగిరి జనసంద్రంగా మారింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాటలు అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపాయి. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బల రామకృష్ణ, వివిధ ప్రాంతాల నుంచి ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

**సినిమా పాలసీ తీసుకు వచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం**

**సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**

పేదవారి కంటనీరు తుడవడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాజకీయాలను నడుపుతున్నారని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తెలుగు సినీచరిత్ర లో తండ్రికి తనయుడుగా గ్లోబల్‌స్టార్ రామ్‌చ రణ్ అభిమానుల గుండెల్లో స్థానాన్ని సంపా దించుకున్నారన్నారు. ఈ కార్యక్రమం రాజమ హేంద్రవరంలో జరగడం ఆనందంగా ఉంద న్నారు. కూటమి ప్రభుత్వం పవన్‌కల్యాణ్ నేతృ త్వంలో సినిమా పాలసీని తీసుకు రావడానికి సిద్ధంగా ఉందన్నారు.

### ఎవరేమన్నారంటే..

నా 30 ఏళ్ళ సినిమా చరిత్రలో 14 సిని మాలు తీశాను. అన్ని సినిమాలను తెలుగులో డబ్బింగ్ చేశాం. మొదటగా తెలుగులో తెలుగు టెక్నీషియన్స్‌తో ఈ సినిమా తీశాను. ఓ అధికా రికి, ఓ ప్రజాప్రతినిధికి మధ్య జరిగే వారే ఈ గేమ్ ఛేంజర్ అని చిత్ర దర్శకుడు శంకర్ వివరించారు. హీరతో శ్రీకాంత్ మాట్లాడుతూ దర్శకుడు శంకర్ నామీద నమ్మకంతో క్యారెక్టర్ ఇచ్చారు. రామ్‌చరణ్‌తో నటించడం ఇది రెండో సినిమా. రామ్‌చరణ్ ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే వ్యక్తి అని అన్నారు.. రాజమహేంద్రవరంలో గేమ్‌ఛేంజర్ ఈవెంట్ జరగడం ఎంతో సంతో షంగా ఉంది. అందులోనూ శంకర్ దర్శక త్వంలో సినిమాలో నటించడం మరీ ఆనందంగా ఉంది. మా అమ్మపేరు పార్వతి. ఈ సినిమాలో నా పేరు పార్వతి చిత్ర హీరోయిన్ అంజలి అన్నారు. పండుగ వారం రోజులు ముందే వచ్చింది. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తీసుకువచ్చిన గేమ్ ఛేంజర్ ఆఫ్ పాలి టిక్స్.. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఇది దేవుని స్క్రిప్ట్.. గేమ్ ఛేంజర్ సినిమాల్లో రామ్ చరణ్ చాలా బాగా నటించారు. ఈ సినిమాకు నేషనల్ అవార్డు రావడం ఖాయం. శంకర్ వంటి ప్రముఖ దర్శకుల దర్శకత్వంలో నటిం చడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని నటుడు పృథ్వీరాజ్ అన్నారు.



హాజరైన అభిమానులు



## ఇంకా మిగిలే ఉంది..

**ముంపు మండలాల్లో పరిహారం అటూ..ఇటూ**

**వ్యక్తిగత పరిహారం అందని జాబితాలో అనేకమంది**

**సర్వే సమయంలోనే అన్యాయం చేశారంటూ గగ్గోలు**

**తాజా జాబితాలో పేర్లు మాయం కావడంపైనా తీవ్ర అసంతృప్తి**

**ఆదుకోవాలంటూ మంత్రి నిమ్మల, కలెక్టర్‌కు వేడుకోలు**

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కుక్కునూరు : చాన్నాళ్ళ నుంచి పరిహారం పొందేందుకు ఎదురుచూసిన రోజు రానే వచ్చింది. వేలాది కుటుంబాల్లో పండుగ ముందే సంబరం నింపింది. అయితే ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లో వ్యక్తిగత పరిహారం అందని ఇళ్ళల్లో నిరాశ, నిస్పృహలను మిగిల్చింది. ఎన్నాళ్ళ నుంచో ఎదురుచూస్తున్న వ్యక్తిగత పరిహారం చెల్లింపుల్లో ఏదో తేడా జరిగి నట్టు అనేక మందికి అనుమానం కలిగించింది. 2013-14 మధ్య పరిహారం చెల్లింపు నిమిత్తం అర్హులైన నిరా శ్రయ కుటుంబాల జాబితాలపై సర్వే చేశారు. అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాల్సిందిగా పదేపదే కోరింది. దీనికి తగ్గట్టుగానే అప్పట్లో ఆయా జాబితాల్లో అప్పటికే గుర్తించిన అర్హులతో బహిర్గతపరిచారు. దీంతోపాటు పరిహార చెల్లింపు జాబితాల తయా రీలో అప్పట్లోనే పదేపదే తప్పులు దొర్లినట్టు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. స్థానిక రాజకీయాలు ఒక ఎత్తయితే, ఇంకోవైపు అధికారుల నిర్లక్ష్యం తోడైందంటూ ఆగ్రహ వేశాలు వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల నుంచి బయటపడేందుకు అప్పట్లో క్షేత్రస్థాయి అధికారులు కూడా తమదైన పద్ధతులను అనుసరించారు. స్థానికంగా లేనివారి పేర్లు జాబితాలో చోటు చేసుకుంటు న్నాయని, ఉన్నవారిని జాబి తాలో లేకుండా చేస్తున్నారంటూ పదేపదే ఫిర్యాదుల పర్వం సాగింది. ఇదే తరుణంలో ఆనాడు ఐటీడీఏ పీవోగా ఉన్న షాన్‌మోహన్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి.ఇలాంటి పరిస్థితి ఎక్కడైనా ఉంటే తనకు వాట్సప్ సందేశం పంపితే చాలంటూ ప్రత్యే కంగా ఒక నెంబర్ ఇచ్చి మరిన్ని ఫిర్యాదులకు తెరలేపారు. ఇదికాస్తా చాలా గ్రామాల్లో వ్యక్తిగత కక్షలతో ఒకరిపై మరొకరు అప్పట్లో ఫిర్యాదులు చేసుకున్నట్టు ఆరోపణలు వెలువడ్డాయి. ఏలూరు కలెక్టరేట్‌తో పాటు జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయానికి ఫిర్యాదులు చేతపట్టుకుని వచ్చిన వారి సంఖ్య అప్పట్లో ఎక్కువ.

### ఇంతకీ ఏం జరిగిందంటే..

కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు గతంలో తెలంగాణలో ఉండేవి. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రెండు ముంపు మండలాలను ఆంధ్రలో విలీనం చేశారు. అయితే దీర్ఘకాలికంగా హైదరాబాదు, ఖమ్మం పరిసరాలతో సంబంధం ఉన్న స్థాని కులు జీవనోపాధికి ప్రతీ ఏటా ఆయా ప్రాంతా లకు తరలివెళ్ళేవారు. తమ ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఓటరు కార్డు, ఉపాధి హామీ కూలీ కార్డు అన్నీ ఇక్కడే ఉండేవి. వీలు కుదిరినప్పు డల్లా జీవనో పాధికి పొరుగు ప్రాంతాలకు వెళ్ళడం, తిరిగి స్వగ్రామానికి వెనక్కి రావడం జరుగుతుండేది. వ్యక్తిగత పరిహారం చెల్లింపు కోసం సర్వే జరుపుతున్నప్పుడు మాత్రం స్థాని కంగా నివాసం ఉంటున్నారా, లేదా అనే సమాచారం నమోదు చేసేందుకు ఇరుగు పొరుగున ఆరా తీయగా కొందరు వ్యక్తిగత ద్వేషంతో తమ గ్రామంలో స్థానికంగా లేరంటూ తప్పుడు సమాచారం అందించడం, దానినే అధికారులు నమోదు చేసినట్టు భారీగా విమ ర్శలు వెలువడ్డాయి. సర్వేలో ఈ తరహా పంచాయితీలు, మరోవైపు వాట్సప్ గ్రూపుల్లో లేనిపోని తప్పుడు సమాచారాలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే తమకు న్యాయం చేయాల్సిందిగా అప్పట్లోనే ముఖ్య మంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు దృష్టికి సైతం నిర్వాసితులు తీసుకువెళ్ళారు. జాబితాలో నిర్వాసితుల పేర్లు నమోదు కాలేదో తిరిగి వారందరికీ న్యాయం చేసేలా ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు. ఫలితంగానే ఇప్పుడు హర్షామోదాలు ఒకవైపు, నిరాశ, నిస్పృహలు ఇంకోవైపు తొంగి చూస్తున్నాయి.

### పరిహారంలో ఎప్పుడూ తంటాలే

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కుటుంబాలకు పరిహారం చెల్లించే ప్రతీసారి మిశ్రమ ఫలితాలు, అనుభవాలు ఎదురవుతూనే ఉంటాయి. ఈసారి కూడా వ్యక్తిగత పరిహారం చెల్లింపు వేగంగా జరగ్గా అదే క్షణంలో పరిహారం అందని కుటుంబాలు డీలా పడ్డాయి. అన్ని అర్హతలు ఉన్నా తమకు న్యాయం జరగలే దంటూ ఘొల్లుమంటున్నాయి. ఒక్క వ్యక్తిగత పరిహారమే కాదు నిర్వాసిత కుటుంబాల్లో యువతులకు నిర్దేశించిన తేదీలో పెళ్ళికాకుంటే వారి పేర్లను పరిహార జాబితాలో చేర్చకుండా అప్పటి నుంచి ఇప్పటిదాకా నానా యాగి చేస్తూనే వచ్చారు. ఈసారి కూడా వ్యక్తిగత పరిహారం చెల్లింపులో కూటమి ప్రభుత్వం తీసుకున్న చొరవ ఆయా కుటుంబాల్లో సంతృప్తినిచ్చింది. ఇంతకుముందు జగన్ ప్రభుత్వ జమానాలో వ్యక్తిగత పరిహారం పెంచి పది లక్షల వరకు ఇస్తామంటూ జారీ అయిన జీవో సక్రమంగా అమలై ఉంటే ఆ మొత్తాన్ని అందుకుని ఉండేవాళ్ళమన్న భావన అనేక మందిలో ఉంది.

### యూనియన్ బ్యాంకు వద్ద రద్దీ

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో కుక్కునూరు మండలంలో ఆరు ముంపు గ్రామాలకు ఒకేసారి వ్యక్తిగత పునరావాస పరిహారం, ఇళ్ల పరిహారం, స్థలం వద్దనుకున్నవారికి పరిహారం ఇలా ఏదో ఒక పరిహారం నిర్వాసితుల ఖాతాల్లో జమ అయ్యింది. ఈ క్రమంలో బ్యాంకులో పడిన సొమ్ము నిర్ధారణ చేసుకునేందుకు నిర్వాసితు లంతా బ్యాంకుకు వెళ్లడంతో కుక్కునూరు యూనియన్ బ్యాంకు ఉదయం నుంచి కిటకిట లాడింది. ఈక్రమంలో పలువురు మద్యం మత్తులో తూగుతున్నారు. లక్షలాది రూపాయలు పరిహారం జమ కావ డంతో విలాసాల వైపు పరుగులుతీస్తున్నారు. కుక్కునూరు మండలంలో ఓ వ్యక్తి ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి ఆటోకి కిరాయి రూ.వెయ్యి చెల్లించినట్లు సమాచారం.



### ఆదుకోండి.. బాబూ ?

వ్యక్తిగత పరిహారం చెల్లింపు విషయంలో జాబితాలో తమ పేర్లు లేకపోవడం, తమకు జరిగిన అన్యాయంపై అనేక కుటుంబాలు కూటమి నేతలను కలిసి తమ గోడు వినిపిం చాయి. కుక్కునూరు మండలం కివ్వాకలో 110 మంది నిర్వాసితులకు పరిహారం జమ కాలేదు. ఈ క్రమంలోనే శనివారం జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానా యుడును కూటమి నేతలు కలిసి తాజా పరిణామాలను ఆయనకు వివరించారు. న్యాయం జరిగేలా చూడాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు మూలిశెట్టి నాగేశ్వరరావు, అశోక్, ఉప సర్పంచ్ పిచ్చుకరాజు, చుంచు సత్యనారాయణ ముంపు మండలాల్లో తాజాగా నెలకొన్న పరిణామాలను మంత్రికి వివరించారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి నిర్వాసితుల గోడును ఆమె దృష్టికి తీసుకువెళ్ళారు. 'నిజంగా అర్హులై ఉంటే పరిహారం చెల్లింపు విషయంలో ఎలాంటి అన్యాయం జరగదు. ఖచ్చితంగా న్యాయం జరుగుతుంది..." అంటూ మంత్రి రామానాయుడు, కలెక్టర్ వెట్రిసెల్వి తమను కలిసిన నేతలకు హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో మతోన్మాద ముప్పు

## మత సామరస్యాన్ని కాపాడాలి.. సీపీఎం జిల్లా మహాసభలో వక్తలు



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం నేత ఉమామహేశ్వరరావు

భీమవరం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మతోన్మాద ముప్పు పొంచి ఉందని, మత సామరస్యాన్ని కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. భీమవరంలో సీపీఎం జిల్లా 26వ మహాసభలను ఉమామహేశ్వరరావు శనివారం ప్రారంభించారు. దేశంలో బీజేపీ నేతృత్వంలో నడుస్తున్న ఎన్డీయే పాలనతో రాజకీయాలను కార్పొరేట్ శక్తులు శాసిస్తున్నాయని తెలిపారు. బీజేపీ తీసుకువసున్న జమిలి ఎన్నికలతో దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం మనుగడ సాగించలేవని అన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు కలిసి వచ్చే అన్ని శక్తులు, సంస్థలతో విశాల వేదికలు ఏర్పాటుచేసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహాసభలకు జేఎన్వీ గోపాలన్, చింతకాయల బాబూరావు, బురిడి వాసుదేవరావు, కళ్యాణి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. అనంతరం జిల్లా సమగ్రాభివృద్ధికి పలు సూచనలతో తీర్మానాన్ని ఆమోదించారు. వాటి వివరాలను జిల్లా కార్యదర్శి బలరాం వివరించారు. గోదావరి నది నీటి కాలువల ద్వారా జిల్లాలో ఉన్న సారవంతమైన భూముల్లో అధికోత్పత్తి చేయవచ్చన్నారు. జిల్లాలో ఉపాధి కల్పించే వందలాది ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. ఫ్యాక్టరీలు తెరిపించాడానికి ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. జిల్లాలో విపరీతమైన కాలుష్యం వేధిస్తోందని మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. జిల్లాలోని నీటిలో అత్యంత ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఉన్నట్లు నిపుణులు గుర్తించి పలు సూచనలు చేసినా పాలకులు పట్టించుకోకపోవడం శోచీయమన్నారు. జిల్లాలోని అన్ని రకాల పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. మహాసభలలో మంతెన సీతారాం, కవురు పెద్దిరాజు, రాజారామ్మోహన్ రాయ్ పాల్గొన్నారు. జిల్లాల నలుమూలల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

# గిరిజన కుటుంబాల వలస

## పోలవరం మండలంలో ఖాళీ అవుతున్న గ్రామాలు

- ముంపు గ్రామాల్లో పంటలు లేవు
- ఉపాధి లేక విలవిల
- గ్రామీణ వ్యాపారంపై ప్రభావం
- కుటుంబాలతో సహా ఇతర ప్రాంతాలకు పయనం


ట్రాక్టర్లపై తరలివెళుతున్న వ్యవసాయ కూలీలు

ఏలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పరిసర గ్రామాల్లో ప్రజల ఆర్థిక జీవన విధానాన్ని పూర్తిగా మార్చివేసింది. ప్రాజెక్టు ఎగువన 23 గిరిజన గ్రామాలు ఖాళీ చేయడంతో సుమారు 3 వేల గిరిజన కుటుంబాలు ఇతర మండలాలకు తరలి వెళ్లిపోయాయి. ప్రాజెక్టు ఎగువన వేలాది ఎకరాల ముంపుతో గిరిజనులకు వ్యవసాయ పనులు లేవు. జనాభా తగ్గడంతో మండల కేంద్రంలో వ్యాపారాలు సన్నగిల్లాయి. ఒకవైపు ప్రాజెక్టు భవిష్యత్ తరాలకు మేలు చేస్తుందన్న ఆశ, మరో వైపు ఉపాధి, ఉద్యోగ, వ్యాపారాలు లేక జీవితాలు అస్తవ్యస్తం అవుతున్నాయన్న నిరాశ గ్రామ ప్రజలను కలచి వేస్తున్నాయి. గ్రామాలు ఖాళీ కావడంతో స్థానిక వ్యాపారులు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయదారులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిండి లేక, పిల్లల చదువుల కోసం తప్పనిసరి పరిస్థితిలో వలస బాట పడుతున్నారు. వందలాది కుటుంబాలు తట్టా బుట్టా సర్దుకుని పిల్లలతో సహా పొగాకు సీజను పనులకు వలస వెళుతున్నారు. గ్రామాలు ఖాళీగా నిర్మానుష్యంగా మారుతున్నాయి.

### వ్యాపారాలకూ నష్టం

పోలవరంలో వ్యాపార దుకాణాలు బోసిపోయాయి. గిరిజన గ్రామాలు వలసపోవడంతో ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయదారులు తమ పొలాలు కోల్పోవడంతో జీవనోపాధి మార్గం లేదు. నిత్యావసరాల కొనుగోలుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో వ్యాపారం మందగించింది. జనవరి నుంచి మే వరకూ వ్యవసాయ పనులు లేకపోవడం వలన ఐదు నెలల పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడే బస చేసి పనులు చేసుకుని సంపాదించుకుని రావలసిన పరిస్థితులు నెలకొన్నాయి. యడ్లగూడెం, కమ్మరగూడెం, పట్టిసీమ, గూటాల గ్రామాల నుంచి వందల కుటుంబాలు ట్రాక్టర్లపై బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి ప్రాంతాలకు పొగాకు పనులకు వలస వెళుతున్నారు. స్థానికులకు ఉపాధి, పిల్లల చదువులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### 80 కుటుంబాలు వలస

పోలవరం మండలం నుంచి వ్యవసాయ కూలీలు శనివారం 80 కుటుంబాలు బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం మండలాలకు తరలి వెళ్లాయి. మండలంలో ప్రస్తుతం వ్యవసాయ పనులు లేవు. ఇసుక ర్యాంపులు కూడా లేకపోవడంతో భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, పెయింటర్లు ఇతర మండలాలకు వలస పోతున్నారు.


కుటుంబంతో సహా వలస వెళుతున్న కూలీలు


పోస్టర్ ఆవిష్కరించిన ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్, తదితరులు

# ట్రిపుల్ ఐటీలో వచ్చే నెల 25 నుంచి టెక్ జెట్

## టెక్‌జెట్ 25 పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఫిబ్రవరి 25, 26, 27 తేదీలో జాతీయస్థాయి టెక్‌ఫెస్ట్, టెక్‌జెట్ 25 నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను స్టూడెంట్ డెవలప్‌మెంట్, క్యాంపస్ యాక్టివిటీ సెల్ ఆధ్వర్యంలో ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. టెక్‌ఫెస్ట్‌ల వల్ల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌లో దాదాపు 5 వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. రొబోటిక్స్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇతర ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఫైనాన్స్ ఆఫీసర్ నాగార్జునాదేవి, ప్లేస్‌మెంట్స్ డీన్ శ్యామ్, జ్యోతిలాల్‌నాయక్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లోని ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు సాంకేతికత, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ శనివారం నిర్వహించారు. సెట్లీ సంస్థ నిర్వాహకులు విద్యార్థులకు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. అకడమిక్స్ డీన్ రత్నాకర్, శ్రీకాకుళం క్యాంపస్ ఇన్‌చార్జి సతీష్ పాల్గొన్నారు.

### ముగిసిన టెక్ హ్యాకథాన్

ఆర్జీయూకేటీ పరిధిలో టెక్‌హ్యాక్‌దాన్ ఫేజ్-2 కార్యక్రమం శనివారం ముగిసింది. నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో శుక్ర, శనివారాల్లో హ్యాకథాన్ నిర్వహించారు. విద్యార్థులు సమర్పించిన టెక్నికల్ వెబ్‌లను పరిశీలించి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్స్ శ్రావణి, శ్యామ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆవిష్కరణకర్తలు కావాలి

## ఏపీ నిట్ డీన్ సందీప్


విద్యార్థులకు నిట్ పరిసరాల గురించి వివరిస్తున్న సందీప్

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ సమాజం మెచ్చుకునే ఆవిష్కరణకర్తలు కావాలని ఏపీ నిట్ డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ వి.సందీప్ అన్నారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్వీ రమణారావు, రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దాపురం నవోదయ విద్యాలయం, పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ స్కూల్‌కు చెందిన 180 మంది విద్యార్థులు శనివారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రయోగశాలలు, గ్రంథాలయం, వర్క్‌షాపు పరిశీలించారు. సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం పాటుపడాలన్నారు. విద్యార్థి పరిశోధకునిగా రాణించాలంటే పాఠశాల విద్య నుంచి సరైన పునాది ఉండాలన్నారు. ఉపాధ్యాయులు కె.విజయ్, ప్రేమలత, మనీషా, లక్ష్మీనారాయణ, ప్రసాద్, దిలీప్, సాయి అప్పారావు పాల్గొన్నారు.


కేజీబీవీల ప్రిన్సిపాల్స్, టీచర్ల శిక్షణలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్

# కేజీబీవీ సిబ్బందికి 'పాల్' శిక్షణ

ఏలూరు అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వున్న కస్తూరిబా బాలికోన్నత పాఠశాల (కేజీబీవీ)ల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులకు 'పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్)' పేరిట ల్యాబ్ ట్రైనింగ్ ఇస్తున్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.పంకజ్‌కుమార్ శనివారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్ విజయవాడ జిల్లాల్లోని 10 కేజీబీవీల ప్రిన్సిపాల్స్, గణితం, ఆంగ్లం, తెలుగు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. ఏపీసీ పంకజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో 18ల్యాబ్‌లుండగా, కొత్తగా మరో 14ల్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సమగ్రశిక్ష ఏఎంవో ఆర్.రామారావు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేక్రమంలో ఉపాధ్యాయులు బోధన సాగించేందుకు వీలుగా కేజీబీవీల్లో విప్లవాత్మక సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతివరకు చదివే విద్యార్థులు గణితం, ఆంగ్లం, తెలుగు పాఠ్యాంశాలను సులభంగా పజిల్స్‌రూపంలో నేర్చుకునేందుకు 'పాల్' ల్యాబ్‌ల్లోని ట్యాబ్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష 'పాల్' స్టేట్ కోఆర్డినేటర్ డి.మాధవీలత, ఏలూరు డీవైఈవో రవిప్రకాష్, జీసీడీవో నవీనకుమారి, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కొవ్వలిలో సైన్స్ ప్రదర్శన పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ


వీరవాసరంలో సైన్స్ ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

# భావి శాస్త్రవేత్తలు

## కొవ్వలి, వీరవాసరంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

దెందులూరు / ఏలూరు అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో సృజ నాత్మకతను వెలికితీస్తాయని, వారంతా భావి శాస్త్రవేత్తలు కావాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారం వారు ప్రారంభించారు. 27 మండలాల నుంచి విద్యార్థులు 91 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కలెక్టర్ వెట్రిసెల్వి జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ ప్రదర్శనలు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వరదలు, రోడ్డు, అగ్ని ప్రమాదాలు సాంకేతిక పరిజ్ఞానంతో నివారించడం, చెత్తను పర్యావరణహితంగా నిర్మూలించడం వంటి అనేక సామాజిక అంశాలు ప్రదర్శించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. పోలసానిపల్లి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థిని వి.వినీల, తడికలపూడి జడ్పీ హైస్కూలు విద్యార్థిని ఎస్కే సాజిద్దాని, గార్లమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.కీర్తన, కె.పవన్, చింతలపూడి జడ్పీ హైస్కూలు విద్యార్థుల బృందం డి.తేజశ్రీ, పి.అలేఖ్య, ఎంపికయ్యారు. టీచర్స్ విభాగంలో భీమడోలు జడ్పీ హైస్కూలు టీచరు ఎండి.హసీనాబేగం, దెందులూరు జడ్పీ హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయిని టీఎస్ఎన్ఆర్. కల్యాణి రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. వారికి డీఈవో వెంకట లక్ష్మమ్మ బహుమతులను అందించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. అన్ని పుస్తకాలను అందుబాటు ఉంచాలని హెచ్ఎం శర్మకు ఆదేశించారు.

### పశ్చిమలో..

భీమవరం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో విజ్ఞానాన్ని సైన్స్ ఫెయిర్ వంటి కార్యక్రమాలు పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. వీరవాసరం ఎంఆర్‌కె జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లోని అంతర్గత శక్తులను సైన్స్ విద్య వెలికితీస్తుందన్నారు. దీనికి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రజా ప్రయోజనాలకు అవసరమైన పరిశోధనలు చేయాలన్నారు. తొలుత విద్యార్థుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముందుగా ఏపీజే.అబ్దుల్ కలాం, సీవీ.రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 20 మండలాల నుంచి మండల స్థాయిలో ఎంపికైన 60 అంశాలను ప్రదర్శనకు ఉంచారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, డీఈవో ఇ.నారాయణ, ఎస్ఎస్ఏ ఏపీసీ పి.శ్యామ్‌సుందర్, జిల్లా సైన్స్ అధికారి వివిఎంజెడ్ శ్యామ్ ప్రసాద్, జడ్పీటీసీ జి.జయ ప్రకాష్‌నాయుడు, హెచ్ఎం జె.శ్రీనివాసరావు, తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో కె.కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. మెంటే పార్థసారథి, ఎస్.కమల, ఎ.మౌనిక, ఎంఈవోలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ కానిస్టేబుల్ ఫిజికల్ టెస్ట్‌లో 117 మంది అర్హత


పోలీస్ కానిస్టేబుల్ ఎంపికల పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థినులు

ఏలూరు క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా శనివారం మహిళా అభ్యర్థినులకు నిర్వహించిన స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో 117 మంది అర్హత సాధించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 204 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు (సివిల్) ఖాళీగా ఉండగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసి ప్రిలిమనరీ పరీక్షలు నిర్వహించింది. వీటిలో అర్హత సాధించిన 4976 మంది అభ్యర్థులకు గత నెల 30 నుంచి దేహదారుడ్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మహిళా అభ్యర్థినులు 979 మంది అభ్యర్థినులు అర్హత సాధించగా వారికి ఈనెల 3, 4 తేదీల్లో ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో స్పోర్ట్స్ ఈవెంట్స్‌ను నిర్వహించారు. 3న 490 మంది అభ్యర్థినులు హాజరుకావాల్సి ఉండగా 242 మంది హాజరయ్యారు. వారిలో స్పోర్ట్స్ ఈవెంట్‌లో 102 మంది క్వాలిఫై అయ్యారు. శనివారం 489 మంది హాజరు కావాల్సి ఉండగా 277 మంది హాజరయ్యారు. వారిలో 1117 మంది అర్హత సాధించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో మహిళా పోలీసు అధికారిణులు, సిబ్బంది ఈవెంట్స్‌ను నిర్వహించారు.


పద్మశ్రీని సత్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపి

# జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీకి పూలే అవార్డు

ఏలూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి పూలే అవార్డును అందజేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ నగరంలో బీసీ భవనం ఏర్పాటు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు లంకా వెంకటేశ్వరరావు, బీసీ మహిళలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రత్యేక స్థానం కల్పించాలని కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ బీసీలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బి.వెంకట్రావు, అబ్బిరెడ్డి రంగ ముత్యాలు, బి.ధనలక్ష్మి, మొటికి రాఘవ, కన్నబాబు, రాంబాబు, బీసీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

### హత్యాయత్నం కేసు నమోదు

ఏలూరు క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మద్యం ఇప్పించలేదని ఒక వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడిచేశారు. పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఏలూరు చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన దాలి వెంకట దుర్గా శంకర్‌ను ఈనెల 2న చింటు, మరో ఇద్దరు మద్యానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అతను నిరాకరించడంతో బీరు బాటిల్‌తో దాడి చేశారు. తీవ్ర గాయాలతో శంకర్ ఆసుపత్రిలో చేరాడు. ఆసుపత్రిలో బాధితుడి వాగ్మూలంపై టూటౌన్ పోలీసులు చింటు, మరో ఇద్దరిపై హత్యాయత్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ప్రయాణికురాలి గొలుసు చోరీ

ఉండి, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): ఆటోలో మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించారు. యండగండి ఎగువ నుంచి వస్తున్న ఆటోలో మహిళ మెడలో గొలుసు లేకపోవడంతో ఆమె కంగారుపడింది. తోటి ప్రయాణికులపై అనుమానం వచ్చింది. యండగండిలో ఆటో ఆగిన వెంటనే కేకలు వేయడంతో స్థానికులు చేరారు. అనుమానిత మహిళలను పోలీసులకు అప్పగించారు. ఉండి నుంచి పోలీసులు విచ్చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వెళ్లినట్లు సమాచారం. అయితే దీనిపై విచారిస్తున్నట్లు తెలిసింది.

## చెరకు ట్రాక్టరును తప్పించబోయి

# గుడిలోకి దూసుకుపోయిన ట్రాలీ లారీ


కనకదుర్గమ్మ గుడిలోనికి దూసుకుపోయిన ట్రాలీ లారీ

ఏలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చెరకు ట్రాక్టరును తప్పించబోయిన ట్రాలీ లారీ రోడ్డు పక్కనే ఉన్న కిళ్లీ దుకాణాన్ని ఢీకొట్టి కనక దుర్గమ్మ గుడిలోకి దూసుకు పోయిన ఘటన శనివారం రాత్రి జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగాలాండ్‌కు చెందిన ట్రాలీ లారీ రాజమండ్రి వైపు ఐరన్ పైపుల తో వెళుతోంది. తల్లాడ - దేవరపల్లి బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ నగర్ వద్దకు వచ్చేసరికి జంగారెడ్డిగూడెం మండలం లోని తాడువాయి సుగర్ ఫ్యాక్టరీకి వెళ్లే చెరకు ట్రాక్టరును తప్పించబోయింది. ప్రమాదవశాత్తు ట్రాలీ లారీ రోడ్డు పక్కనే ఉన్న నరసింహారావుకు చెందిన కిళ్లీ దుకాణాన్ని, కనకదుర్గమ్మ గుడి గోడను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవరుకు స్వల్పగాయాలు మినహా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అక్కడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. లారీ డ్రైవరు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# తప్పిపోయిన బాలికను అప్పగించిన పోలీసులు

భీమవరం క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాలిక మిస్సింగ్ కేసును పోలీసులు కొన్ని గంటల్లోనే ఛేదించారు. పట్టణానికి చెందిన బాలిక ఈ నెల 2వ తేదీ రాత్రి 7 గంటల నుంచి కనిపించలేదు. బాలిక తల్లిదండ్రులు చుట్టుపక్కల సమీప బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో ఈ నెల 3న భీమవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి ఎస్పి అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో వన్‌టౌన్ ఎస్‌ఐ కిరణ్ కుమార్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బాలిక మొబైల్ లోకేషన్ ప్రత్యేక ఇంటిలిజెన్స్ రిపోర్ట్ సహాయంతో పాలకోడేరు మండలం గరగపర్రు సమీపంలోని శ్మశానవాటికలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం బాలికను తల్లిదండ్రుల సమక్షంలో విచారించగా తన ఇంట్లో వారు పట్టించుకోవడం లేదని అసంతృప్తికి గురై ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన ఒక యువకుడు మాటలు నమ్మి అతనితోపాటు వెళ్ళిపోయినట్లు తెలిపింది. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలను అనుక్షణం పర్యవేక్షిస్తూ ఉండాలని, లేకపోతే చిన్న వయస్సులో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. మొబైల్ ఫోన్ రూపంలో టెక్నాలజీ అందుబాటులో ఉండడం వల్ల ప్రేమ, పెళ్లి పేరుతో మోసపోతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను అనుక్షణం కంటికిరెప్పలా కాపాడుకోవాలని, వారికి ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ కిరణ్ కుమార్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

### పశు వధశాల మూయకుంటే

# శిరస్సు ఖండించుకుంటా

## మాజీ మంత్రి కారుమూరి

తణుకు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తేతలిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న లేహం ఫుడ్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం వెంటనే మూసి వేయాలని, లేనిపక్షంలో తన శిరస్సును ఖండించుకుంటానని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైసీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోజుకు 400 పశువులను వధించడానికి ఉద్దేశించిన పరిశ్రమ సుమారు 20 ఎకరాల్లో ఉండాలని, తేతలిలో కేవలం మూడు ఎకరాలలో ఏర్పాటుకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. జనావాసాల మధ్య ఇటువంటి పరిశ్రమను నిర్వహిస్తుంటే ఎమ్మెల్యే ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. అనుమతులు లేని ఫ్యాక్టరీకి పోలీసులు ఎలా కాపలా కాస్తున్నారన్నారు. పచ్చని ప్రాంతంలో కాలుష్యం అధికారులకు పట్టదా అని ప్రశ్నించారు.

### ఆశ్రం వైద్య కళాశాలకు నాక్ ఎ గ్రేడ్

ఏలూరు టూటౌన్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): ఆశ్రం మెడికల్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ఎ గ్రేడ్ అవార్డు వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్ అన్నారు. ఆశ్రం వైద్య కళాశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో, కళాశాలలో వివిధ విభాగాలను నాణ్యతా ప్రమాణాలను నాక్ గుర్తించిందన్నారు. సీఈఓ కె.హనుమంతరావు మాట్లాడుతూ కళాశాలకు నాక్ ఎ గ్రేడ్ గుర్తింపు రావడం ద్వారా బాధ్యత పెరిగిందని ఇంకా మెరుగైన వైద్య విద్యనందించేందుకు కృషి చేస్తామన్నారు. కళాశాలకు గుర్తింపు రావడానికి కృషి చేసిన డాక్టర్ వేణుగోపాలరాజుకు అభినందనలు తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ కె.అజయ్ రెడ్డి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్సొలేషన్ బహుమతులు



# ముగ్గుల పోటీలు

## జంగారెడ్డిగూడెంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో..



ముగ్గులను తిలకిస్తున్న విద్యార్థినులు

బుట్టాయగూడెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో శనివారం జరిగిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు, విద్యార్థినులు అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచారు. 66 మంది పోటీలో పాల్గొనగా మొదటి మూడు బహుమతులతో పాటు మరో పది మందికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. కన్సొలేషన్ విజేతలు.. వి.సౌమ్య, డి.రేవతి, పి.భారతి, సీహెచ్ శశికళ, కె.లక్ష్మీలావణ్య, పి.దివ్య, కె.చంద్రిక, డి.వరలక్ష్మి, కె.రేణుక, ఎం.శిరీష బహుమతలుఉ పొందారు. వీరికి ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మద్దిపాటి చైతన్య, టీడీపీ నాయకులు మూత్తారెడ్డి, రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, బీఎం హరిబాబు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. తొలుత ముఖ్యఅతిథులు సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, స్కూల్ చైర్మన్ మద్దిపాటి చైతన్య ముగ్గులను తిలకించారు. కార్యక్రమం అనంతరం ముఖ్యఅతిథులను ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు పూలమాలలు మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ బి.మహేష్, న్యాయవాది అచ్యుత శ్రీనివాస్, కసుకుర్తి ఉమామహేశ్వరావు, ఆంధ్రజ్యోతి యాడ్స్ మేనేజర్ ఆర్‌బీజీ.రాజు, ఏసీఎం సీహెచ్.కృష్ణ, ఆర్ఎం (ప్రొడక్షన్) జి.శ్రీనివాసరావు, ఆంధ్రజ్యోతి సిబ్బంది ఉదయ భాస్కర్, దాసు, సాయిబాబా, కృష్ణ, రామకృష్ణ, ఆదిశేషు, షేక్ అలీమ్, గంగాధర్, కొండలు, రాజేశ్ పాల్గొన్నారు.





ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్, బీఎం హరిబాబు, సూర్యనారాయణరాజు, మురళి తదితరులు







ముగ్గుల పోటీల వద్ద ఆంధ్రజ్యోతి సిబ్బంది






శ్రీవారి ఆలయ ప్రాంగణంలో సింగర్ సునీత, సినీ నటి రేణుదేశాయ్, తదితరులు

## వెంకన్న సన్నిధిలో ప్రముఖుల పూజలు

ద్వారకాతిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రాన్ని సినీ ప్లేబాక్ సింగర్ సునీత, సినీ నటి, మోడల్ రేణుదేశాయ్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు శనివారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకులు, పండితుల నుంచి ముఖమండపంలో శ్రీవారి శేషవస్త్రం, వేదాశీర్వచనం పొందారు. దాదాపు పది వేల మంది భక్తులు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బూత్ అబ్జర్వర్లతో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బూత్ అబ్జవర్లకు, కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. అత్యధిక మెజారిటీతో రాజశేఖర్‌ను గెలిపించాలన్నారు. ఉప్పు ఉమామహేశ్వరరావు, పెద్దిబోయిన శివప్రసాద్, ఆర్నేపల్లి తిరుపతి, అమరావతి అశోక్, నాయుడు సోము తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్ఆర్‌లో సంక్రాంతి సంబరాలు

ఏలూరు అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలల ప్రాంగణంలో శనివారం సంక్రాంతి సంబరాలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. తెలుగువారి సంప్రదాయాలు ఉట్టిపడేవిదంగా చిన్నారులకు భోగిపండ్లు పోయడం, భోగిమంటలు, రంగోలి, బొమ్మలకొలువు, కోలాటం, పలు రకాల పిండివంటల ప్రదర్శనలతో కళాశాల ప్రాంగణంలో ముందస్తు సంక్రాంతి నెలకొంది. భోగిమంటలను ప్రారంభించిన సీఆర్ఆర్ విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు వి.వి.బాలకృష్ణారావు మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే లక్ష్యంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొ న్నారు. కోశాధికారి చిట్టూరి జానకిరామయ్య, కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, పాలకవర్గ సభ్యులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అనిత ఎంపిక



బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన ట్యాలీ అనిత

ఏలూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో ఈనెల 5 నుంచి 12 వరకు జరిగే 74వ సీనియర్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టుకు స్థానిక సెయింట్ థెరిస్సా డిగ్రీ విద్యార్థిని ఎ.ట్యాలీ అనిత ఎంపికైందని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. గతనెల మార్టేరులో జరిగిన సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించడం ద్వారా ట్యాలీ అనితను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసరావు తెలిపారు

## గోవుల అక్రమ రవాణాను అడ్డుకున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు

ద్వారకాతిరుమల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఏ విధమైన అనుమతులు, వాహనాలకు రిజిస్ట్రేషన్ లేకుండా జరుగుతున్న గోవుల అక్రమ రవాణాను శనివారం భజరంగ్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఎం.నాగులపల్లి వద్ద రెండు వాహనాలలో విశాఖ జిల్లా చోడవరం నుంచి గుంటూరుకు జరుగుతున్న అక్రమరవాణాను అడ్డుకుని వారు ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విజయవాడలో జరిగే హైందవ శంఖారావం కోసం శ్రీకాకుళం నుంచి వెళ్తున్న భజరంగ్‌దళ్ కార్యకర్తలు 20 ఆవులున్న రెండు వాహనాలను అడ్డుకున్నారు. గోవుల అక్రమరవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కోళ్ల వ్యర్థాల వాహనాల సీజ్

పెదపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చేపలకు మేతగా వేయడానికి తీసుకెళ్తున్న కోళ్ల వ్యవర్థాల వాహనాలను పట్టుకుని కేసు నమోదు చేశామని పెదపాడు ఎస్ఐ కె.శారదాసతీష్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ శనివారం ఉద యం కోళ్ల వ్యర్థాలతో వస్తున్న ఏడు వాహనా లను స్వాధీనం చేసుకున్నామని, ఆ వ్యర్థాలను మట్టిలో పూడ్చి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## 3,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని శ్రీధరవేలేరు అటవీ ప్రాంతంలో మెరుపుదాడులు నిర్వహించారు. పాములేరు నది ఒడ్డున ఉన్న ఇసుక తిన్నెలలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 3,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు.

## ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



ఏలూరులో పిల్లలతో కేక్ కట్ చేయిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్, తదితరులు

ఏలూరు అర్బన్/ చింతలపూడి/ టి.నరసాపురం/పెదవేగి/కామవరపుకోట/లింగపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు మండలంలోని అన్ని భవితకేంద్రాల్లో లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని సమగ్రశిక్ష జిలా ప్రాజెక్టు విలీన విద్య విభాగం ఆధ్వర్యంలో శనివారం పలు కార్యక్రమాలను నిర్వహించినట్టు ఎస్ఎస్ఏ జిల్లా ఏపీసీ డాక్టర్ కె.పంకజ్‌కుమార్ తెలిపారు. దృష్టిలోపం, అంధత్వం గల పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోన్న సౌకర్యా లను వివరించారు. పిల్లలతో కేక్ కట్ చేయించారు. చింతలపూడి మండలం చింతలపూడి జిల్లా పరిషత్ సుబ్బరాజు హైస్కూలులో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సతీమణి విజయ రోషన్‌కుమార్ కేక్ కట్ చేసి దివ్యాంగులకు పంపిణీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విజయకేతనం స్టడీ మెటీరియల్ అందించారు. టి.నరసాపురం మండలంలోని భవిత పాఠశాల లో ఎంఈవో టి.రామ్మూర్తి ఆధ్వర్యంలో, పెదవేగి మండలంలోని పెదవేగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో గ్రామ సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో భవిత విద్యార్థులకు బహుమతులు అందించారు. కామవరపుకోట మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవోలు డి.సుబ్బారావు, సీహెచ్.ప్రశాంత కుమార్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని గల భవిత కేంద్రంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వేమూరి శ్రీహరి ఆధ్వర్యంలో బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

బుట్టాయగూడెం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఇఫ్టూ అనుబంధ యూనియన్ ప్రగతిశీల అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం దొరమామిడిలో వర్కర్లు ఆందోళన చేశారు. ఆందోళనలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన పార్టీలు అంగనవాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి రాతపూర్వక హామీ ఇచ్చారని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న రెండు పార్టీలు అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కారిస్తామన్నారు. ఆందోళనలో బి.ఆకాశ్, జి.పద్మ లలిత, వి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు న్యాయం చేస్తాం

▸▸ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

కుక్కునూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసితులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని కలెక్టర్ వెట్రాసెల్వి భరోసా ఇచ్చారు. శనివారం కలెక్టర్‌ను కుక్కునూరు, వేలేరుపాడు టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, అమరవరపు అశోక్ కలిశారు. చాలా మంది నిర్వాసితులకు పునరావాస పరిహారం అందలేదని ఇళ్లపేర్లు జాబితాలో లేకపోవడంతో ఇంటి పరిహారం జమకాలేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె మాటాడుతూ దాదాపు 560 మంది నిర్వాసితుల పేర్లు కేఆర్.పురం ఐటీ డీఏ కార్యాలయంలో పెండింగులో ఉన్నాయన్నారు. వాటన్నిటిని పరిశీలించి అర్హులైన వారందరికి పరిహారం అందిస్తామన్నారు.

## రేపటి నుంచి మెడికల్ పింఛన్ల పునఃపరిశీలన

ఏలూరు అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఈ నెల 6 నుంచి చేపట్టనున్న మెడికల్ పింఛన్ల రీ-వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శనివారం ఏలూరులో నిర్వహించిన జిల్లా కో-ఆర్డినేషన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గుంటూరు నుంచి జిల్లాకు మూడు బృందాలు వస్తాయని, ఒక్కో బృందంలో ఒక ఆర్థోపెడిక్ డాక్టరు, ఒక జనరల్ మెడిసిన్ స్పెషలిస్టు, జిల్లాకు చెందిన మరో వైద్యాధికారితోపాటు, ఒక డిజిటల్ అసిస్టెంట్ ఉంటారని వివరించారు.

## ఫిబ్రవరిలో అమ్మవార్ల జాతర

భీమడోలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : భీమడోలులో ఫిబ్రవరి 7 నుంచి మార్చి 9 వరకూ జరుగనున్న గ్రామ దేవతల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. భీమడోలులోని గ్రామ దేవతల ఆలయాల ప్రాంగణంలో జాతరకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. జాతర కమిటీ ఆధ్వ ర్యంలో వివాదాలకు తావులేకుండా జాతర విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.



విద్యార్థులతో సహపంక్తి భోజనంచేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్, తదితరులు

## ఇంటర్ విద్యార్థులకు భోజన పరిపుష్టి

### ఏలూరులో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

ఏలూరు అర్బన్/ఏలూరు/చింతలపూడి/లింగపాలెం/కుక్కునూరు/జీలుగుమిల్లి/కొయ్యలగూడెం, జనవరి 4 (ఆంధ్ర జ్యోతి):విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత విద్యకు ఇంటర్మీడియట్‌లోనే బాటలు వేసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని' శనివారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 26 హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్, ప్రిన్సిపాల్ రాజ్‌కృష్ణ, విద్యార్థులక కావాల్సిన ప్లేటులు, గ్లాసులు అందించిన మారం హనుమంతరావు, రాజ్‌కుమార్, పురోహిత్, టీడీపీ నాయకులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రారంభించారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ఎంఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కౌముది ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఎంఈవో కె.రామారావు నాయకులు పాల్గొన్నారు. కుక్కునూరు జూనియర్ కళాశాలలో టీడీపీ నాయకులు కోటగిరి సత్యనారాయణ, శ్రీనివాస్, అప్పలరాజు, ఎం.వెంకటరమణ ప్రారంభించారు. జీలుగుమిల్లి ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో, కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మధ్యా హ్న భోజన పథకాన్ని కూటమి నాయకులతో కలిసి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి ప్రారంభించారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : జేసీ

ఏలూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. చాటపర్రులో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలనుంచి సమస్యలు స్వీకరించి మాట్లాడారు. ప్రజలు తమ భూసంబంధ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులను అందిస్తే గ్రామంలోనే పరిష్కరించుకునే అవకాశం సదస్సుల ద్వారా ఏర్పడిందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చే వినతులపై సర్టిఫికెట్లు, ఇతర రెవెన్యూ సేవలకు ఫీజు మినహాయింపు లభిస్తోంద న్నారు. భూసమస్యలను ఎలా పరిష్కరించాలి అనే అంశంపై రెవెన్యూ అధికారులకు సూచిం చారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూసమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అక్కడినుంచి సొసైటీలో ఉన్న ధాన్యం సంచులను పరిశీలించారు. అధికారులు పాల్గొన్నారు.

## జడ్పీలో ఆఫీస్ సబార్డినేట్‌లకు పదోన్నతులు

ఏలూరు రూరల్, జనవరి 4 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న పలువురు ఆఫీస్ సబార్డినేట్‌లకు పదోన్నతుల ఉత్తర్వులను శనివారం జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ప్రతి క్యాడర్‌లలో ఖాళీలు ఏర్పడిన వెంటనే అర్హత కలిగిన సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 46 మందికి పలు క్యాడర్‌లలో పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి పనిచేసే సంస్థకోసం పాటుపడి గౌరవాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల మోహన్‌రావు, నటరాజు, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్‌కుమార్ తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకునే హైస్కూల్ ప్లస్‌లను ఎన్టీఆర్ విద్యాలయాలుగా కొనసాగించాలని మంత్రికి విన్నవించినట్లు విఠల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ పామర్తి ఏసురాజు, జోనల్ చైర్మన్ శ్రీనివాస్, ప్రసాద్, సహాయ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస కాలనీల్లో ఇంకుడుగుంతల పనులు ప్రారంభం

ఏలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పోలవరం పంచాయతీలో కొత్త రామయ్యపేట పునరావాస కాలనీల్లో ఎంపీడీవో ఈ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఇంకుడు గుంతల పనులు ప్రారంభించారు. కాలనీలలో డ్రెయినేజీ వ్యవస్థలు లేక ఇళ్లల్లో వాడకం నీరు రోడ్లపై నిలిచి పునరావాస గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఇంకుడు గుంతల పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ వరలక్ష్మి, మేడూరి గంగరాజు, కార్యదర్శి వై. కొండలరావు, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ పోతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తా

బుట్టాయగూడెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ మనేంద్రరావు అన్నారు. విజయవాడలో జరిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టేట్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగ్గా బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ మనేంద్రరావు జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. శనివారం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ మర్రి వెంకటేశ్వరావు, డాక్టర్ ఎస్.అక్కులన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుడి గుర్తింపు

ఏలూరు క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పవర్‌పేట గేటు దాటుతుండగా ఈనెల ఒకటిన ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. దినపత్రికలో వచ్చిన వార్త ఆధారంగా ఏలూరు పవర్‌పేటకు చెందిన నార్ని నెహ్రూ కోటేశ్వరరావు (71) బంధువులు గుర్తించారు.



పోస్టర్ ఆవిష్కరించిన ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్, తదితరులు

# ట్రిపుల్ ఐటీలో వచ్చే నెల 25 నుంచి టెక్ జెట్

## టెక్‌జెట్ 25 పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఫిబ్రవరి 25, 26, 27 తేదీలో జాతీయస్థాయి టెక్‌ఫెస్ట్, టెక్‌జెట్ 25 నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను స్టూడెంట్ డెవలప్‌మెంట్, క్యాంపస్ యాక్టివిటీ సెల్ ఆధ్వర్యంలో ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. టెక్‌ఫెస్ట్‌ల వల్ల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌లో దాదాపు 5 వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. రొబోటిక్స్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇతర ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఫైనాన్స్ ఆఫీసర్ నాగార్జునాదేవి, ప్లేస్‌మెంట్స్ డీన్ శ్యామ్, జ్యోతిలాల్‌నాయక్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లోని ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు సాంకేతికత, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ శనివారం నిర్వహించారు. సెట్లీ సంస్థ నిర్వాహకులు విద్యార్థులకు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. అకడమిక్స్ డీన్ రత్నాకర్, శ్రీకాకుళం క్యాంపస్ ఇన్‌చార్జి సతీష్ పాల్గొన్నారు.

## ముగిసిన టెక్ హ్యాకథాన్

ఆర్జీయూకేటీ పరిధిలో టెక్‌హ్యాక్‌దాన్ ఫేజ్-2 కార్యక్రమం శనివారం ముగిసింది. నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో శుక్ర, శనివారాల్లో హ్యాకథాన్ నిర్వహించారు. విద్యార్థులు సమర్పించిన టెక్నికల్ వెబ్‌లను పరిశీలించి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్స్ శ్రావణి, శ్యామ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆవిష్కరణకర్తలు కావాలి

## ఏపీ నిట్ డీన్ సందీప్



విద్యార్థులకు నిట్ పరిసరాల గురించి వివరిస్తున్న సందీప్

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ సమాజం మెచ్చుకునే ఆవిష్కరణకర్తలు కావాలని ఏపీ నిట్ డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ వి.సందీప్ అన్నారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు, రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దాపురం నవోదయ విద్యాలయం, పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ స్కూల్‌కు చెందిన 180 మంది విద్యార్థులు శనివారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రయోగశాలలు, గ్రంథాలయం, వర్క్‌షాపు పరిశీలించారు. సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం పాటుపడాలన్నారు. విద్యార్థి పరిశోధకునిగా రాణించాలంటే పాఠశాల విద్య నుంచి సరైన పునాది ఉండాలన్నారు. ఉపాధ్యాయులు కె.విజయ్, ప్రేమలత, మనీషా, లక్ష్మీనారాయణ, ప్రసాద్, దిలీప్, సాయి అప్పారావు పాల్గొన్నారు.



కొవ్వలిలో సైన్స్ ప్రదర్శన పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

# భావి శాస్త్రవేత్తలు

## కొవ్వలిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

దెందులూరు / ఏలూరు అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో సృజ నాత్మకతను వెలికి తీస్తాయని, వారంతా భావి శాస్త్రవేత్తలు కావా లని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారం వారు ప్రారంభించారు. 27 మం డలాల నుంచి విద్యార్థులు 91 ప్రాజెక్టులను ప్రద ర్శించారు. కలెక్టర్ వెట్రిసెల్వి జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ ప్రదర్శనలు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వరదలు, రోడ్డు, అగ్ని ప్రమాదాలు సాంకేతిక పరి జ్ఞానంతో నివారించడం, చెత్తను పర్యావరణ హితంగా నిర్మూలించడం వంటి అనేక సామాజిక అంశాలు ప్రదర్శించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. పోలసానిపల్లి ఏపీ రెసిడె న్షియల్ స్కూల్స్ విద్యార్థిని వి.వినీల, తడికల పూడి జడ్పీ హైస్కూ లు విద్యార్థిని ఎస్‌కే సాజిద్గాని, గార్లమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠ శాల విద్యార్థులు కె.కీర్తన, కె.పవన్, చింతలపూడి జడ్పీ హైస్కూలు విద్యార్థుల బృందం డి.తేజశ్రీ, పి.అలేఖ్య, ఎంపిక య్యారు. టీచర్స్ విభాగంలో భీమడోలు జడ్పీ హైస్కూలు టీచరు ఎండి.హసీనాబేగం, దెందులూరు జడ్పీ హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయిని కల్యాణి రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. వారికి డీఈవో లక్ష్మమ్మ బహుమతులను అందించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రంథాల యాన్ని కలెక్టర్ పరిశీలించి అన్ని పుస్తకాలను అందుబాటు ఉంచాలని హెచ్‌ఎం శర్మకు ఆదేశించారు.

## కేజీబీవీ సిబ్బందికి 'పాల్' శిక్షణ

ఏలూరు అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వున్న కస్తూరిబా బాలికోన్నత పాఠశాల (కేజీబీవీ)ల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులకు 'పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్)' పేరిట ల్యాబ్ ట్రైనింగ్ ఇస్తున్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.పంకజ్‌కుమార్ శనివారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్ విజయవాడ జిల్లాల్లోని 10 కేజీబీవీల ప్రిన్సిపాల్స్, గణితం, ఆంగ్లం, తెలుగు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. ఏపీసీ పంకజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో 18ల్యాబ్‌లుండగా, కొత్తగా మరో 14ల్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సమగ్రశిక్ష ఏఎంవో ఆర్.రామారావు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేక్రమంలో ఉపాధ్యాయులు బోధన సాగించేందుకు వీలుగా కేజీబీవీల్లో విప్లవాత్మక సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతివరకు చదివే విద్యార్థులు గణితం, ఆంగ్లం, తెలుగు పాఠ్యాంశాలను సులభంగా పజిల్స్‌రూపంలో నేర్చుకునేందుకు 'పాల్' ల్యాబ్‌ల్లోని ట్యాబ్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష 'పాల్' స్టేట్ కోఆర్డినేటర్ డి.మాధవీలత, ఏలూరు డీవైఈవో రవిప్రకాష్, జీసీడీవో నవీనకుమారి, ఏఎల్‌ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్ ఫిజికల్ టెస్ట్‌లో 117 మంది అర్హత

ఏలూరు క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా శనివారం మహిళా అభ్యర్థినులకు నిర్వహించిన స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో 117 మంది అర్హత సాధించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 204 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు (సివిల్) ఖాళీగా ఉండగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసి ప్రిలిమనరీ పరీక్షలు నిర్వహించింది. వీటిలో అర్హత సాధించిన 4976 మంది అభ్యర్థులకు గత నెల 30 నుంచి దేహదారుఢ్య పరీక్షలను నిర్వహిస్తు న్నారు. దీనిలో భాగంగా మహిళా అభ్యర్థినులు 979 మంది అభ్యర్థినులు అర్హత సాధించగా వారికి ఈనెల 3, 4 తేదీల్లో ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో స్పోర్ట్స్ ఈవెంట్స్‌ను నిర్వహిం చారు. 3న 490 మంది అభ్యర్థినులు హాజరుకా వాల్సి ఉండగా 242 మంది హాజరయ్యారు. వారిలో స్పోర్ట్స్ ఈవెంట్‌లో 102 మంది క్వాలిఫై అయ్యారు. శనివారం 489 మంది హాజరు కావా ల్సి ఉండగా 277 మంది హాజరయ్యారు. వారిలో 1117 మంది అర్హత సాధించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది ఈవెంట్స్‌ను నిర్వహించారు.



కైకలూరులో ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి



ముదినేపల్లి కళాశాలలో భోజన వడ్డిస్తున్న కూటమి నాయకులు



కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోజన పథకం ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

# జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

కైకలూరు జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వ డొక్కాసీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించడం ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శాంతిజ్యోతి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థుల నోటి దగ్గర భోజనాన్ని కూడా తీసివేశారన్నారు. ప్రతీరోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాదరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ పీజెఎస్ మాల్యాద్రి, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, టీడీపీ కోకన్వీనర్ తేరా రమేష్‌బాబు, పట్టణపార్టీ అధ్యక్షుడు ఎండీ జానీ, సర్పంచ్ నవరత్నకుమారి పాల్గొన్నారు.

**ముదినేపల్లి :** ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన మధ్యాహ్న భోజన సదుపాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిన్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, మండల జనసేన కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, బీజేపీ మండల శాఖ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ముదినేపల్లి డీసీ వైస్ చైర్మన్ హనుమార పెదబాబు, పోసిన పాండురంగారావు, కేనం ప్రసాద్ పాల్గొన్నారు.

**మండవల్లి :** మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మండవల్లి ఎంఈఓ-2 రత్నసునాదం, ప్రిన్సిపాల్ బేతపూడి రవితేజ, జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్‌లు శనివారం ఎన్డీయే నాయకులు ముళ్లపూడి సత్తిబాబు, కోనపరెడ్డి కోటేశ్వరరావు, ఎలికె రాంబాబు, యార్లగడ్డ శంకర్, గుడివాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఆహారపథకాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో తెలిపారు.

**కలిదిండి :** మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు అన్నారు. శనివారం కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూటమి నాయకులతో కలసి మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. సర్పంచ్ సానా మీనా సరస్వతీ, ప్రిన్సిపాల్ త్రినాథ్, అధ్యాపకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సంకర్షణపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

## రీ సర్వే సమస్యలు పరిష్కరిస్తాం

ముదినేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రీసర్వే వల్ల ఏర్పడిన భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ముదినేపల్లి తహసీల్దార్ సుభానీ తెలిపారు. శనివారం మండలంలోని సంకర్షణపురం, కొరగుంటపాలెం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో జాయింట్ ఎల్‌పిల సమస్యలను పరిష్కరించి భూములను రైతు వారీగా సబ్ డివిజన్ చేయాలని పలువురు రైతులు అర్జీలు అందజేశారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. డీటీ శ్రీనివాస ప్రసాద్, సర్పంచ్ సంకుల నాగరాజు, పేరే రామకృష్ణ, సర్వేయర్ రాజశేఖర్ రెడ్డి, వీఆర్వోలు కె.మురళీ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## 6న అసైన్డ్ భూముల పరిష్కారానికి గ్రామసభలు

### ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో నిషేధిత జాబితాలోని 22ఎ నుంచి తొలగింపు కోసం ఈనెల 6వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్జీలు స్వీకరణకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామసభల్లోనూ పెద్దఎత్తున 22ఎ జాబితాల నుంచి తొలగింపు భూముల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయన్నారు. కలిదిండి గ్రామంలోని 495 ఎకరాలు మద్దల రంగనాయకులు అసైన్డ్ భూములు మాజీ సైనికులు కొరకు కేటాయించిన 1800 ఎకరాలు గుర్వాయిపాలెంకు చెందిన 70 ఎకరాల ఎస్సైన్డ్ భూములు, భాస్కర రావుపేట గ్రామానికి చెందిన 179ఎకరాలు అస్సైన్డ్ భూముల పరిష్కారానికై దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. మండవల్లి మండలం ఉనికిలి గ్రామంలో 212ఎకరాల పొలిటికల్ సఫరేర్స్ భూములు, ముదినేపల్లి మండలం వైవాక గ్రామంలో 120ఎకరాల స్వాతంత్ర్య సమర యోధుల భూముల హక్కుదారులు హక్కు పత్రాలతో హాజరు కావాలన్నారు.

## లాకుల నుంచి నీరు వృథాగా పోకుండా అడ్డుకట్ట

కైకలూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రైతులకు నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తామరకొల్లు సాగునీటి సంఘ అధ్యక్షుడు గంగుల ఏసు రాజు అన్నారు. శనివారం కైకలూరు మండలం వింజరంలోని పోల్‌రాజ్ పంటకాలువ లాకుల నుంచి వృథాగా తరలిపోతున్న నీరుకు అడ్డుకట్ట వేశారు. లాకుల మర మ్మతులకు గురికావడంతో నీరు వృథాగా పోతుండడంతో టార్పాలిన్లతో తాత్కాలిక అడ్డుకట్ట వేశారు. ఎమ్మెల్యే,ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి లాకుల మరమ్మతుల నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బ్రెయిలీ జయంతి

ముదినేపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధులకు లిపిని రూపకల్పన చేసిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను శనివారం ముదినేపల్లి భవిత కేంద్రంలో నిర్వహించారు. కేంద్రం అధికారిణి బి.నీలిమ అధ్యక్షత వహించారు. ఎంఈవో కె.నరేష్ కుమార్ మాట్లాడుతూ బ్రెయిలీ ప్రత్యేకంగా రూపొందించిన లిపి వల్ల ఎంతో మంది అంధులు విద్యారంగంలో రాణిస్తున్నారన్నారు. హెచ్‌ఎం విజయకుమార్ పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీలో అవకతవకలపై చర్యలు

ముసునూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడిన, లబ్ధిదారుల నుండి ఫిర్యాదులు వచ్చిన కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ నజీముల్లా షా హెచ్చరించారు. శనివారం ముసునూరులో రేషన్ పంపిణీ వాహనాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనంలో సరుకులు స్టాక్, ఈ పాస్ మిషన్‌ద్వారా పంపిణీ వివరాలను ఆయన పరిశీలించారు. రేషన్ సరుకుల పంపిణీపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేయాలని పంపిణీ దారుడికి ఆయన సూచించారు. రేషన్ పంపిణీపై ఫిర్యాదులు వస్తే సహించేదిలేదన్నారు.

## ఉత్తమ బోధన అందించాలి

ముసునూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. శనివారం రమణక్కపేట ఎంపీపీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆయన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎంఈవో పరిశీలించి, ఆహారాన్ని రుచి చూశారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేసి, ఉపాధ్యాయలకు పలు సూచనలు ఇచ్చారు.

## చెల్లని చెక్ కేసులో జైలుశిక్ష

నూజివీడు టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కుకేసులో ఒకరికి సంవత్సరం జైలుశిక్ష, రూ.10లక్షలు జరిమానా విధిస్తూ నూజివీడు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పారు. నూజివీడుకు చెందిన ఆనందరావు శామ్యూల్, రామకూరి దాసు నుంచి 2022లో రూ.10 లక్షలు అప్పు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించమని దాసుకోరగా తీర్మానం నిమిత్తం రూ.10లక్షలకు ఆనందరావు శామ్యూల్ ఇచ్చిన చెక్కు బ్యాంకులో నగదు లేదని తిరిగి వచ్చింది. దాసు కోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి వెంకటేశ్వర రావు, ఆనందరావు శామ్యూల్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.10లక్షలు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

## 5 లీటర్లు సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా చీపురుగూడెంలో శనివారం జరిపిన దాడిలో కొమ్ము విజయలక్ష్మి వద్ద 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. సారా తయారీ అమ్మకాలు, బెల్ట్ షాపులు నిర్వహణ, నల్ల బెల్లం అమ్మకాలు చేయటం నేరమని ఇటువంటి వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# చెరువు ఆక్రమణలు పరిశీలన



నల్లచెరువులో ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

ముసునూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువుల ఆక్రమణలపై రైతులు, నాయకుల చేసిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో ఆక్రమణలను అధికారులు శనివారం పరిశీలించారు. ముసునూరులోని నల్లచెరువు, దేవర చెరువులతోపాటు చెక్కపల్లి కొత్త చెరువులో ఆక్రమణలను ఇరిగేషన్ డీఈ అర్జునరావు, మత్స్య శాఖ ఏడీ రాజ్‌కుమార్ పరిశీలించారు. టీడీపీ నాయకుడు గార్లపాటి నరసింహారావు మాట్లాడుతూ నల్ల చెరువు సూమారు 70శాతం పైగా ఆక్రమణకు గురైందని, ఈ ఆక్రమణలను తొలగించకపోతే చెరువు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయిందని, దీంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని అధికారులకు వివరించారు. ఆక్రమణలపై ఐదేళ్లుగా ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు అర్జీలు అందజేస్తున్నా పట్టించుకోలేదన్నారు. చెరువుల ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని నరసింహారావు కోరారు. నల్లచెరువు, దేవరచెరువుల్లో చేపల పెంపకం చేసుకునేలా విసులుబాటు కల్పించాలని ఏడీ రాజ్‌కుమార్‌ను ఆయన కోరారు. ఆక్రమణకు గురైన చెరువులపై సమగ్ర నివేదికను తయారు చేసి, ఉన్నతాధికారులకు అందజేస్తామని ఇరిగేషన్ డిఈ అర్జునరావు తెలిపారు. ఈ కార్యాక్రమంలో ఈవోపీఆర్డీ బి.ఏ.సత్యనారయణ, ఏఈ విజయ్, పంచాయితీ కార్యాదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరావులు పాల్గొన్నారు.

# రెండో రోజు ఆర్టీసీ కార్మికుల నిరసన




ఆర్టీసీ డిపోవద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నూజివీడు టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రెండోరోజు కార్మికులు ఆర్టీసీ డిపో వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడు తూ ఆర్టీసీ డ్రైవర్ ఎం.దాసు పై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని సర్క్యులర్ 1-19 ఆర్టీసీ కార్మికులకు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నూజివీడు డిపో అధ్యక్షుడు ఎం.చిరంజీవి, కోశాధికారి పి.శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, చాట్ల పుల్లారావు, వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావానికి తరలిరావాలని బైక్ ర్యాలీ



హైందవ శంఖారావం బైక్ ర్యాలీ

చాట్రాయి. జనవరి 4: విజయవాడలో ఆదివారం జరుగుతున్న హైందవ శంఖారావం సభ జయప్రదం చెయ్యాలని కోరుతూ శనివారం మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. చీపురుగూడెం రామాలయంలో పూజలు చేసి మంకొల్లు, పోలవరం, చాట్రాయి మీదుగా ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ దేవాలయాల్లో, దేవదాయ శాఖలో అన్యమత ఉద్యోగులను తొలగించాలని, పూజలు, ప్రసాదం తయారీ అత్యంత భక్తిశ్రద్ధలతో నాణ్యతతో జరగాలని, 8 డిమాండ్లతో జరుగుతున్న సభను జయప్రదం చేయాలన్నారు. బొట్టు రామచంద్రరావు, మందలపు జగదీష్, తమ్మిశెట్టి లక్ష్మణరావు, చీకటి శ్రీనివాసరావు, వసంతరావు పాల్గొన్నారు. చాట్రాయిలో అప్పారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లపై చర్చించారు. తుమ్మల జగన్, నెక్కలపు వెంకటేశ్వరరావు, శర్మ, వేణు, నరశింహరావు, విద్యాధరరెడ్డి పాల్గొన్నారు.



## అక్రమ చెరువుల తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు

కలిదిండి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు వెంబడి అక్రమ చేపల, రొయ్యల చెరువుల తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకృష్ణ హెచ్చరించారు. శనివారం దుంపలకోడు దిబ్బలో ఓ రైతు ఉప్పుటేరు మార్జిన్‌లో ఎక్స్‌కవేటర్‌తో చెరువు తవ్వటానికి ప్రయత్నిస్తుండగా, రెవెన్యూ అధికారులతో కలసి అడ్డుకున్నారు. ఆర్‌ఐ శ్యామల, వీఆర్వో గుడిపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే కామినేని

## హైందవ శంఖారావం సభ విజయవంతం చేయాలి

కైకలూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం గన్నవరం విమానాశ్రయం వద్ద నిర్వహించే బహిరంగ సభ స్థల ప్రాంగణాన్ని కేంద్ర మంత్రి వర్మతో కలిసి ఆయన పరిశీలించారు. సభావేదికను ఇతర ఏర్పాట్లును మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పరిశీలించారు.

## రేపటి నుంచి కైకలూరు పోలీస్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

కైకలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు యువత జూదాలవైపు మళ్లకుండా కైకలూరులో పోలీస్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించ నున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహిస్తారని మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10వేలు, నాల్గో బహుమతి రూ.5వేలు అందిస్తారన్నారు.

## విద్యాకమిటీ అవగాహన సదస్సు

మండవల్లి జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం అయ్యవారిరుద్రవరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల యాజమాన్య కమిటీ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. హెచ్‌ఎం చిరిగిరి పిచ్చేడు, ఉపాధ్యాయులు జయశ్రీ, ఎస్‌ఎంసి చైర్మన్ విజయశాంతి, వైస్ చైర్మన్ కె.శ్రీధర్, ఎస్‌ఎంసీ సభ్యులు, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.



గ్రామస్థులతో మంత్రి కొలుసు పార్థసారథి

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి

నూజివీడు టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బోర్వంచ, కొన్నంగుంట గ్రామాల్లో శనివారం ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేయటమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల నుంచి అందిన వినతులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు.

## విజిలెన్స్ ఏవోగా మధుమోహన్

ముసునూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల ఏవోగా పనిచేస్తున్న ఎస్.మధుమోహన్ డిప్యూటేషన్‌పై విజయవాడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవోగా నియమితులయ్యారు. శనివారం ముసునూరు రైతుసేవా కేంద్రంలో నూజివీడు ఏడీఏ విద్యాసాగర్, వ్యవసాయ సిబ్బంది, డీలర్లు మధుమోహన్‌ను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మాంచారు. ఏడాదిన్నరపాటు మండల ఏవోగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. విజిలెన్స్ ఏవోగా మంచి పేరుప్రఖ్యాతులు సంపాదించుకోవాలని ఏడీఏ విద్యాసాగర్ అకాంక్షించారు. కార్యాక్రమంలో ఆర్‌ఎస్‌కె సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జ్ ఏవోగా సూరిబాబు

ముసునూరు మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారిగా కె.సూరిబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న ఎస్.మధుమోహన్ డిప్యూటేషన్‌పై విజిలెన్స్ ఏవోగా వెళ్ళారు. నూజివీడు ఎస్‌టిపిఎల్ ల్యాబ్ ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న కె.సూరిబాబును ఇన్‌చార్జ్ ఏవోగా సూరిబాబును జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైనవారికి అందించడంతోపాటు వ్యవసాయం అభివృద్ధికి కృషి చేస్తానని సూరిబాబు అన్నారు. వ్యవసాయ సిబ్బంది ఏవోకు పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందనలు తెలిపారు.